నేడు అర్వపల్లి మండల సర్వసభ్య సమావేశం

అర్వపల్లి, డిసెంబర్ 21 : జాజిరెడ్డి గూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు గడ్డిపల్లి కేవీకేలో కిసాన్ మేళా

గరిడేపల్లి, డిసెంబర్ 21 : మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో ఈ నెల 23న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్లు కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, దక్షిణ తెలంగాణ మండలం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పాలెం డాక్టర్ ఎం.మల్లారెడ్డి, కాటన్ ప్రాజెక్టు నోడల్ అధికారి డాక్టర్ ఎస్.ఉషారాణి, కలుపు యాజమాన్య శాస్త్రవేత్త పద్మజ, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొననున్నారన్నారు. దీనిలో భాగంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్రాల ప్రదర్శన మన జిల్లాలో పండించే పంటల్లో అధిక దిగుబడులకు తగిన సలహాలు, సూచనలు, అధిక సాంద్రత, పత్తి సాగుపై రైతులతో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నెమ్మికల్ పశువుల సంత వేలం

ఆత్మకూర్.ఎస్, డిసెంబర్ 21 : మండలంలోని నెమ్మికల్ పశువుల సంత వేలం పాటను గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. వేలంలో 8 మంది పాల్గొన్నట్లు డీఎల్‌పీఓ సాంబిరెడ్డి తెలిపారు. అత్యధికంగా రూ.41,41,516 కు నెమ్మికల్ గ్రామానికే చెందిన బిజిగ సైదులు పాడి సంత వేలం పాటను దక్కించుకున్నట్లు చెప్పారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.5,05,294 అధికంగా పాడారు. కార్యక్రమంలో ఎంపీఓ సంజీవ, సర్పంచ్ దావీదు, ఎంపీటీసీ ముత్తయ్య, ఉపసర్పంచ్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొవిడ్ నివారణపై అవగాహన

అర్వపల్లి, డిసెంబర్ 21 : అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొవిడ్, న్యూమోనియా నివారణ చర్యలపై ఎంఎల్‌హెచ్‌ఆర్, ఏఎన్ఎం, ఆశలకు గురువారం డాక్టర్ మణిదీప్ అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ఆశలు ఇంటింటికి తిరుగుతూ చిన్న పిల్లల్లో వచ్చే నిమోనియాను గుర్తించి ఆ పిల్లలను పీహెచ్‌సీకి పంపించాలన్నారు. కొవిడ్ మళ్లీ ప్రబలుతున్నందున ప్రజలందరూ మాస్క్ ధరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చరణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

నూతనకల్, డిసెంబర్ 15 : మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీడీఓ ఇందిర అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వీధుల్లో చెత్త పేరుక పోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీఓ శశికళ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు నిర్వహించాలి

నడిగూడెం, డిసెంబర్ 21 : మండలంలోని రత్నవరం నుంచి తెల్లబెల్లి వరకు గల ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు దున్నా సతీశ్ అన్నారు. గురువారం రహదారిని పరిశీలించి మాట్లాడారు.

ముక్కోటికి మట్టపల్లి ముస్తాబు

- విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మఠంపల్లి, డిసెంబర్ 21 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 22,23వ తేదీల్లో నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉభయ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే స్నానఘట్టాల వద్ద వివిధ సౌకర్యాలు కల్పించారు. కృష్ణానది వద్దకు వెళ్లలేని వృద్ధుల కోసం రాజగోపురం సమీపంలో కుళాయిలు సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల పాటు అన్నదానం చేసేందుకు ఇక్కడ సామాజిక వర్గాల వారీగా సత్ర కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా స్వామి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్ర, శనివారాలు ఆలయంలో జరిగే వివిధ కార్యక్రమాలను ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ మంగళవారం వెల్లడించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని 22న శుక్రవారం సాయంత్రం మంగళవాయిద్యం, వేద మంత్ర పఠనం, శాస్త్రీయ సంగీత కచేరీ, శ్రీలక్ష్మీనరసింహ నామ సంకీర్తనం, శనివారం ప్రాతఃకాలార్చన, స్వామి వారి సుప్రభాతం, ధృవ స్వామి వారికి అభిషేకం, 5గంటలకు స్వామి వారి ద్వార దర్శనం సాయంత్రం 8గంటలకు వైకుంఠ ఏకాదశి మహత్యం, ధృవ చరిత్ర, స్వామి వారి ఆలయ ప్రవేశం, తీర్థ ప్రసాద వినియోగం, శాస్త్రీయ సంగీత కచేరీ, శ్రీరామతీర్థ సేవాశ్రమం, పిడుగురాళ్ల భక్తమండలి ఆధ్వర్యంలో నృసింహ నామ సంకీర్తనలు, సాయంత్రం వరకు పలు ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగుతాయి. 23న తెల్లవారుజామున 4గంటలకు ధృవ స్వామికి అభిషేకాలు, ప్రాబోది నివేదనలు పూర్తయ్యాక 5గంటలకు వైకుంఠ ద్వార దర్శనం అనంతరం కొఠారు ప్రవేశం చేస్తారు. అన్నమాచార్య సంకీర్తనలు, లక్ష ఆరెపత్తిపూజ తదుపరి క్షేత్ర తిరువీధుల్లో గరుడోత్సవం నిర్వహిస్తారు.

విద్యుద్దీపాలంకరణలో నృసింహుడి ఆలయ ముఖద్వారం

ఐక్య ఉద్యమాలతోనే అభివృద్ధి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్

పీవీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తూ రాజ్యాంగ హక్కులను సాధించుకోవాలని, ఐకమత్యంతోనే అభివృద్ధి సాధిస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ అన్నారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు 17వ వర్ధంతి సందర్భంగా గురువారం రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద పి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఎమ్మార్పీఎస్ నాయకులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడిండ్ల అశోక్, చీఫ్ డిప్యూటీ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ మెంబర్ బొల్లెద్దు వెంకటరత్నం, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, మాల మహానాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల ముక్కంటి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నామా వేణు పాల్గొన్నారు.

సెల్ టవర్‌ను తొలగించాలని ఆందోళన చేస్తున్న స్థానిక ప్రజలు

సెల్ టవర్ తొలగించాలని ఆందోళన

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం వెనుక జనావాసాల మధ్య ఉన్న సెల్ టవర్‌ను తొలగించాలని పట్టణంలోని 33, 46వ వార్డు ప్రజలు గురువారం సెల్ టవర్ వద్ద ఆందోళన నిర్వహించారు. పదేండ్లుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని సెల్ టవర్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు పేరాల నర్సింహారావు అన్నారు. సెల్ టవర్ కాల పరిమితి ముగిసినందున గడువు పెంచకుండా టవర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, సెల్ టవర్ వ్యతిరేక కమిటీ ప్రధాన కార్యదర్శి ఉన్నం సత్యనారాయణ, సభ్యులు బి.నాగేశ్వర్‌రావు, వాసు, వెంకటేశ్వర్లు, కె.ఫిరోజ్, రమేశ్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : దిర్శించర్ల జడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ పాఠాలు పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

- డీఈఓ కె.అశోక్

నేరేడుచర్ల / పాలకవీడు, డిసెంబర్ 21 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సులభంగా, నాణ్యంగా బోధించడానికి నిర్వహిస్తున్న తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలను వేగం చేయాలని డీఈఓ కే.అశోక్ అన్నారు. గురువారం ఆయన నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామ జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలు, నిర్మాణం సక్రమంగా ఉందని, దీన్ని మరింత వేగం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయానికి హాజరుకావడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ ఛత్రునాయక్, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం, జాన్‌పహాడ్, పాలకవీడు గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలతో పాటు కస్తూర్బా పాఠశాలను డీఈఓ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి సామర్థ్యం పెంచేలా బోధన చేయాలన్నారు.

గరిడేపల్లి : పొనుగోడు వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా తిరుప్పావడ సేవ

మేళ్లచెర్వు, డిసెంబర్ 21 : మండలవ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, అభిషేకాలు, కుంకుమార్చన పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవ, వేకువజామున పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు, భానుకిరణ్‌శర్మ, వరప్రసాదాచార్యులు, శ్రీనివాసాచార్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, కల్మల్‌చెర్వులోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఐదో రోజైన గురువారం ధనుర్మాసోత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి పూజలు చేయడంతో పాటు ఐదో పాశురంను పఠించారు.

మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై విచారణ

విచారణలో పాల్గొన్న అధికారులు

కోదాడ రూరల్, డిసెంబర్ 21 : కోదాడ మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై మండల ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదుతో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారస్తులను విచారణ చేశారు. అనంతరం ఆర్డీఓ సూర్యానారాయణరావు మాట్లాడుతూ సేకరించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిట్ అధికారి సంతోష్ రావు, ఎంపీడీఓ విజయశ్రీ, ఆర్.వెంకటనగేశ్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు అనువైన సమయం

మునగాల, డిసెంబర్ 21 : చిరు ధాన్యాల సాగుకు అనువైన సమయం ఇదేనని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి అన్నారు. సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురం గ్రామంలో చిరుధాన్యాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నీటి సౌకర్యమున్న రైతులు తమ కుటుంబ అవసరాల కోసం కొంత భూమిలో చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. ప్రస్తుతం మనం నిత్యం తీసుకునే ఆహారం రసాయనాలతో కూడిందని, దీంతో షుగర్, బీపీలతో పాటు క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. కావున ప్రతిఒక్కరూ చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, అరికలు, అండు కొర్రలు, సామలు, జొన్నలు, ఉలవలు, ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం అభినందనీయం

కోదాడ రూరల్, డిసెంబర్ 21 : మాల ధారులకు నిత్యాన్నదానం అభినందనీయమని ఎస్‌వీ విద్యాసంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో సన్నిదానంలో మాలధారులకు గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బర్మావత్ సీతారాంసింగ్, గురుస్వామి రంగారావు, పట్టా నాగరాజు, మాల ధారులు, భక్తులు పాల్గొన్నారు.

కల్మల్ చెర్వుకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని వినతి

గరిడేపల్లి, డిసెంబర్ 21 : మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామానికి మిర్యాలగూడ డిపో నుంచి ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మూలగుండ్ల విజయాసీతారాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు డిపో అసిస్టెంట్ మేనేజర్ సంధ్యారాణికి గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ కల్మల్‌చెర్వు గ్రామానికి గతంలో బస్సు నడపడంతో ఆ రోడ్డులో ఆదాయం బాగానే వచ్చేదని, ప్రస్తుతం దాన్ని నిలిపివేయడంతో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా బస్సును పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ జడ్పీటీసీ బచ్చలకూరి మట్టయ్య, మూలగుండ్ల సీతరాంరెడ్డి, మీసాల యోహాన్, బాలస్వామి, నరేశ్ ఉన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

- డీటీ షాహిన్‌బేగం

నాగారం, డిసెంబర్ 21 : జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నాగారం మండల డిప్యూటీ తాసీల్దార్ షాహిన్ బేగం అన్నారు. గురువారం నాగారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు మండల ఎన్నికల శిక్షణ అధికారులు కె.అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, ఏఆర్ఐ గోపయ్య పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే

నూతనకల్, డిసెంబర్ 21 : బడి బయట ఉన్న పిల్లల వివరాల సేకరణకు సీఆర్పీ కనకం రవీందర్ మండలంలోని పెదనెమిల గ్రామంలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వచ్చే నెల 14 వరకు సర్వే కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో హాజరు శాతం పెంపుతో పాటు బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా చూసేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చిలో క్రిస్మస్ ప్రారంభోత్సవ వేడుకలను ఫాదర్ మార్టిన్ పసల గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ రాక సందర్భంగా ప్రజలందరికీ ముందస్తుగా తెలిపేందుకు ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

– మఠంపల్లి, డిసెంబర్ 21

నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

నేరేడుచర్ల, డిసెంబర్ 21 : నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ జయబాబుపై జనవరి 11న ఉదయం 11గంటలకు అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో మొత్తం 15మంది మున్సిపల్ కౌన్సిలర్లు ఉండగా 10మంది కౌన్సిలర్లు జయబాబుపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ కలెక్టర్‌కు ఇటీవల దరఖాస్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన సూచన మేరకు మున్సిపాలిటీ యాక్ట్-2019 ప్రకారం అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టి అదే రోజు నూతన మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకొనుట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి తన వైస్ చైర్మన్ పదవి, కౌన్సిలర్‌కు రాజీనామా చేసినందున అదేరోజు వైస్ చైర్మన్‌ను సైతం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

టీ ఎమ్మార్పీఎస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా ప్రశాంత్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : ఎమ్మార్పీఎస్ తెలంగాణ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా కనుకు ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నియోజక వర్గ ఇన్‌చార్జి పల్లేటి లక్ష్మణ్ ప్రశాంత్‌కు నియామక పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడిగా వల్దాస్ మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కనుకు రాజేశ్, కోశాధికారిగా పాల్వాయి భరత్, కార్యదర్శులుగా వల్దాస్ వెంకటాద్రి, వల్దాస్ మురళి నియమితులయ్యారు.

గంజాయి రహిత జిల్లానే ధ్యేయం

- కమ్యూనిటీ ఏరియాల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు
- మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు : ఎస్పీ రాహుల్ హెగ్డే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 21 : గంజాయి రహిత జిల్లాగా సూర్యాపేటను నిలిపేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కేసుల నమోదు, దర్యాప్తుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేర దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. గంజాయి నిర్మూళనలో భాగంగా విద్యా సంస్థలు, కమ్యూనిటీ ఏరియాల్లో యాంటీ నార్కొటిక్ కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇప్పటికే గుర్తించిన గంజాయి రవాణా, వినియోగదారులపై నిఘా కొనసాగించాలన్నారు. పోలీస్ ఫంక్షన్ వర్టికల్ పని విభాగాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై స్టేషన్ హౌజ్ అధికారి స్వయంగా బాధితుడితో మాట్లాడి, ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. పెట్రోకార్, బ్లూ కోట్స్ సిబ్బంది సేవలను సమర్థవంతంగా వినియోగించాలని, డీఎస్పీలు, సీఐలు ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు నాగభూషణం, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, మహేశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎండగట్టాలి

- నేటి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- వామపక్ష నాయకులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుంచి అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిన కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలకు నిరసనగా శుక్రవారం దేశ వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకుడు బూర వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు పుల్లూరి సింహాద్రి, బహుజన శ్రామిక రాజ్యం రాష్ట్ర కన్వీనర్ చామకూరి నర్సయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం వైఖరి ఎండగడుతూ ప్రశ్నిస్తున్న 141 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పార్లమెంట్‌లో బీజేపీ నిరంకుశంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపాలని ప్రజాతంత్ర వాదులు, ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, చిన్న పంగ నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

చింతలపాలెం, డిసెంబర్ 21 : ఉపాధి హామీ పథకంతో మండలంలో చేపట్టిన వివిధ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, ఎంపీడీఓ జగదీశ్ ఆధ్వర్యంలో అధికారులు గురువారం రెండో విడుత సామాజిక తనిఖీ నిర్వహించారు. 16 గ్రామ పంచాయతీల్లో 2023 నవంబర్ 14 నుంచి నవంబర్ 22వరకు డీఆర్‌పీల బృందం సభ్యులు ఉపాధి హామీ పథకంతో నిర్వహించిన పంట కాల్వలు, భూ అభివృద్ధి పనులు, చెరువుల పూడికతీత పనులను గుర్తించి, గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ పనులకు గాను రూ.3.20కోట్లు ఖర్చు చేయగా, ఇందులో కూలీలకు రూ.3.13కోట్లు చెల్లించారు. మెటీరియల్ కాంపౌండ్ కింద రూ.7లక్షలు చెల్లించినట్లు ఏపీఓ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్తమద్ది వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, జిల్లా విజిలెన్స్ అధికారి లచ్చిరాంనాయక్, సహాయ విజిలెన్స్ అధికారి ఆశ, ఎస్ఆర్‌పీ రమేశ్, ఈసీ రవి, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి'

మోతె, డిసెంబర్ 21 : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకన్నారు. అధ్యక్షుడిగా శీనయ్య, ప్రధాన కార్యదర్శిగా నరేందర్, ఉపాధ్యక్షులుగా సాయిశ్యాం, కనకమ్మ, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా పల్లెటి ప్రసాద్, రఘునాయక్, వీరన్న, సురేశ్, కన్వీనర్‌గా నర్సయ్య, మహిళా కన్వీనర్‌గా శోభారాణి, క్రీడా కన్వీనర్‌గా సైదులు, సాంస్కృతిక కన్వీనర్‌గా లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వెంటయ్య, జిల్లా కార్యదర్శి పాపిరెడ్డి, వీఓటీటీ కన్వీనర్ లాలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్ఈ పాల్‌రాజ్

చిలుకూరు : విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సీహెచ్.పాల్‌రాజ్ అన్నారు. చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. చిలుకూరు కాలనీవాసులు తమ కాలనీలో కరెంట్ తీగెలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నాయని, వెంటనే తీగలు లాగి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ వెంకట కృష్ణయ్య, ఏడీఈ వెంకన్న,